

పక్కాగా ఎన్నికల కోడ్ అమలు చేయాలి

» కలెక్టర్ నారాయణరెడ్డి



వికారాబాద్ మార్చి 13 : జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎక్కడ కూడా వాల్‌రైటింగ్, పోస్టర్లు, ఫ్లెక్సీలు, ఫ్లాగ్‌లు ఉండొద్దని, వాటిని వెంటనే తొలగించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఎమ్మెల్సీ ఎన్నిక ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదేశించారు. సీసీరోడ్ల నిర్మాణ పనుల్లో పురోగతి బాగుందని, అన్ని మండలాల్లో ఈనెల 20 వరకు పనులు పూర్తి చేయాలన్నారు. బొంరాస్‌పేట్, తాండూరు, బషీరాబాద్ , కొడంగల్ మండలాల పనుల పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని, అనుకున్న అంచనాల మేరకు పనులు పూర్తి అయ్యేలా చూడాలన్నారు. డీఆర్‌డీఏ శ్రీనివాస్, పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డీఈలు, ఈఈలు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి.. పొలంబాట



» తిర్మలాపూర్ తండాలో తాగునీటి ఎద్దడి

పూడూరు, మార్చి 13: వేసవి ప్రారంభంలోనే తాగునీటి ఎద్దడి మొదలైంది. పూడూరు మండలంలోని తిర్మలాపూర్ తండా వాసులు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఎండలు ముదురుతుండటంతో బోర్లలో నీరు అడుగంటిపోతోంది. బిందెడు తాగునీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. తండాలో మిషన్ భగీరథనీరు సరిపడా సరఫరా లేకపోవడంతో మహిళలు పొలంబాట పట్టారు. మహిళలు బిందెలు పట్టుకుని వ్యవసాయ బోర్ల వద్దకు క్యూ కడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తండాలో తాగునీటి ఎద్దడిని తీర్చాలని కోరుతున్నారు.



చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ రాజకీయం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఇక్కడ నుంచి ప్రధాన పార్టీల అభ్యర్థులంతా నియోజకవర్గంలో మంచి పట్టున్న నేతలే కావడం. దీనికి తోడు వారంతా అంగ, అర్థబలం ఉన్న వారు కావడంతో ఈ పోటీ రసవత్తరంగా సాగుతుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఇప్పటి వరకు బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులను అధికారికంగా ప్రకటించగా, కాంగ్రెస్ మాత్రం ప్రకటించ లేదు. అయినా, ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం తమకే టికెట్ ఖాయమని భావించిన సునీతా మహేందర్‌రెడ్డి కూడా ప్రచారాన్ని ముమ్మరం చేశారు.



చేవెళ్ల పోరు రసవత్తరం!

మూడు పార్టీల నుంచీ బలమైన అభ్యర్థులే

- బీఆర్‌ఎస్ అభ్యర్థిగా కాసాని పేరు ఖరారు చేసిన కేసీఆర్
- ఇప్పటికే బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రచార హోరు
- కాంగ్రెస్ నుంచి బరిలోకి సునీతారెడ్డి!
- అధికారికంగా ఖరారు కాని సునీత అభ్యర్థిత్వం
- అయినా, జోరుగా ప్రచారం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

చేవెళ్ల పార్లమెంట్ ఎన్నిక ఈ సారి మరింత రసవత్తరంగా మారుతోంది. ప్రధాన పార్టీలు బలమైన అభ్యర్థులను రంగంలో దించడంతో హోరాహోరీగా త్రిముఖ పోటీ నెలకొంది. ఇప్పటికే భారతీయ జనతా పార్టీ మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేరును ఖరారు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్‌ఎస్ జడ్పీ మాజీ చైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్ పేరును అనూహ్యంగా తెరమీదకు తీసుకువచ్చి బుధవారం ప్రకటించింది. ఇక అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి సతీమణి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి బరిలో దింపాలని నిర్ణయించింది. అయితే ఆమె పేరు ఇంకా అధికారికంగా ఖరారు చేయలేదు. ముందుగా కుదిరిన ఒప్పందం మేరకు సునీతారెడ్డి కుటుంబం ఇటీవల బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ తొలి జాబితాలోనే ఆమె పేరు ఉన్నప్పటికీ చివరి క్షణంలో చేవెళ్ల స్థానాన్ని పెండింగ్‌లో పెట్టారు. అయితే చేవెళ్ల అభ్యర్థినిగా దాదాపు ఆమె పేరును పార్టీ ఖరారు చేయడంతో ఇప్పటికే ఆమె క్షేత్రస్థాయిలో ప్రచారం మొదలు పెట్టారు. మూడు ప్రధాన పార్టీల నుంచి బలమైన నాయకులు రంగంలో దిగుతుండడంతో చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ ముగ్గురు కూడా ఉమ్మడి జిల్లాలో గతంలో రాజకీయంగా క్రియాశీలకంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. ఆర్థికంగా కూడా ఈ ముగ్గురు బలవంతులే. దీంతో రాష్ట్రంలో ఇది ఖరీదైన ఎన్నికగా మారే అవకాశంగా ఉంది. బీజేపీ తరుపున బరిలో దిగుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఇప్పటికే ప్రచారాన్ని ముమ్మరం చేశారు. పార్టీ శ్రేణులతో పాటు ఆర్‌ఎస్‌ఎస్, అనుబంధ సంస్థలు చాపకింద నీరులా ప్రచారం చేస్తున్నాయి. విశ్వేశ్వర్‌రెడ్డి ఇంటింటి ప్రచారంపై ఎక్కువ ఫోకస్ పెట్టారు. గతంలో ఆయన స్వల్ప ఓట్లతో ఓటమి చెందడంతో ఈ సారి ఎన్నికను సవాల్‌గా తీసుకుని వ్యూహాత్మకంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇక అధికార కాంగ్రెస్ నుంచి బరిలో దిగేందుకు సిద్ధమవుతున్న సునీతారెడ్డి ఉమ్మడి జిల్లాలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి కూడా సునీతారెడ్డి వెనుక ఉండి ప్రచారాన్ని ముందుకు తీసుకువెళుతున్నారు. బీఆర్‌ఎస్ నుంచి చేరికలు ముమ్మరం చేస్తున్నారు. సునీతారెడ్డి ఉమ్మడి జిల్లాలో రెండు పర్యాయాలు జడ్పీ చైర్‌పర్సన్‌గా పనిచేయడంతో విస్తృత పరిచయాలు ఉన్నాయి. గత పరిచయాలను ఆమె ఎన్నికల ప్రచారంలో బలంగా వినియోగించుకుంటున్నారు. బీఆర్‌ఎస్ నుంచి తిరిగి పోటీ చేసేందుకు సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి ఆసక్తి చూపకపోవడంతో మరో అభ్యర్థి కోసం బీఆర్‌ఎస్ నాయకత్వం పలు పేర్లు పరిశీలించింది. గతంలో ఈ స్థానం కోసం పోటీ పడిన అనేక మంది సీనియర్ నేతలు మారిన రాజకీయ పరిస్థితుల కారణంగా పోటీకి ఆసక్తిచూపలేదు. దీంతో చివరకు తర్జనభర్జన పడి జడ్పీ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ పేరును ఖరారు చేసింది. టీడీపీ హయాంలో జడ్పీ చైర్మన్‌గా పనిచేసిన కాసాని జ్ఞానేశ్వర్‌కు కూడా జిల్లాలో మాస్ ఫాలోయింగ్ ఉంది. అలాగే ఆయనకు బలమైన సామాజికవర్గం అండ ఉండడంతో బీఆర్‌ఎస్ ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. తొలుత ఆయనను మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బరిలో దింపే విషయం కూడా పరిశీలించినా చివరకు చేవెళ్ల టికెట్ ఖరారు చేశారు. చేవెళ్ల అభ్యర్థిగా జ్ఞానేశ్వర్ పేరు ఖరారు విషయంలో మాజీ మంత్రి సబితారెడ్డి పాత్ర ఎక్కువగా ఉంది. ఆయనకు టికెట్ ఇస్తే గెలిపించే బాధ్యత తీసుకుంటానని ఆమె పార్టీ అధినేత కేసీఆర్‌కు హామీ ఇచ్చినట్లు సమాచారం.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

పార్లమెంటు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

» మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ మార్చి 13(ఆంధ్రజ్యోతిప్రతినిధి): త్వరలో జరుగబోయే పార్లమెంటు ఎన్నికలకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని కలెక్టర్ గౌతమ్ అధికారులకు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నోడల్ అధికారులతో ఎన్నికల సన్నద్ధతపై అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఇందుకు గాను ముందస్తు కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు. అన్ని విభాగాల వారికి శిక్షణ పూర్తి చేయాలన్నారు. ఎన్నికలకు కావాల్సిన సామగ్రి సేకరణ పూర్తి చేయాలన్నారు. ఈవీఎంలు, ఎన్నికల సిబ్బంది రవాణాకు పటిష్ట ప్రణాళిక రూపొందించాలన్నారు. వాహనాలకు జీపీఎస్ సిస్టం అమర్చి వాటిని ట్రాక్ చేయాలన్నారు. స్వీప్ కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. ఎన్నికల ఖర్చు నియంత్రణపై పర్యవేక్షణ చేయాలని, ఫ్లయింగ్ స్క్వాడ్ , ఎస్ఎస్టీ , వీవీటీలు ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వాలన్నారు. బ్యాలెట్ బాక్స్ ఓటింగ్‌కు ఫారం 12డిని ముందుగానే అవసరమైన ఓటర్లకు అందజేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంసీఎంసీ కమిటీ ద్వారా పెయిడ్ న్యూస్, ప్రకటనల ఖర్చును వ్యయనియంత్రణ కమిటీకి ఎప్పటికప్పుడు పంపాలని, ప్రెస్‌మీట్స్, నిర్వహణ, సమాచార లోపం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డీఆర్‌వో హరిప్రియ, లాఆఫీసర్ చంద్రావతి, నోడల్ ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ మున్సిపాలిటీలో ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా సీఎం రేవంత్‌రెడ్డి ఓటు నమోదు

కొడంగల్, మార్చి 13: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నిక నేపథ్యంలో ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ మున్సిపాలిటీలో ఓటు నమోదు చేసుకున్నారని ఈఆర్‌వో మోహన్‌రావు తెలిపారు. తుది ఓటరు జాబితాను తహసీల్దార్ విజయ్‌కుమార్ బుధవారం విడుదల చేశారు. ఈనెల 28న జరిగే ఎమ్మెల్సీ ఉపఎన్నికకు కొడంగల్ ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు.



వికారాబాద్ ఆర్డీవోగా మధుమోహన్

వికారాబాద్, మార్చి 13: వికారాబాద్ నూతన ఆర్డీవో సీహెచ్ మధుమోహన్ నియమితులయ్యారు. పెద్దపల్లి ఆర్డీవోగా పని చేస్తున్న ఆయన ఇక్కడికి బదిలీపై రానున్నారు. ఇక్కడి పని చేసిన ఆర్డీవో విజయకుమారిని ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ములుగు జిల్లా, ఏటూరు నాగారం (గురుకుల సంక్షేమం) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ఇందుకు సంబంధించి రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

» పోలీసు బందోబస్తుతో 51అక్రమ నిర్మాణాలు, వెంచర్ కూల్చివేత

కీసర, మార్చి 13: అక్రమ నిర్మాణాలను అధికారులు ఉక్కుపాదం మోపారు. భారీ బందోబస్తుతో అధికారులు పెద్ద ఎత్తున నిర్మించిన అక్రమ నిర్మాణాలను అధికారులు బుధవారం కూల్చివేశారు. చీర్యాల్ గ్రామంలో సర్వే నంబర్లు 101, 102, 221, 222, 334, 335, 337లో ఫోర్జరీ సంతకాలతో పొందిన అనుమతులతో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. గతంలో చీర్యాల్ గ్రామంలో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, బఫర్‌జోన్, నాలాలు కబ్జా చేసి, ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని ఫిర్యాదు వచ్చాయి. కాగా జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు జారీ చేశారు. పంచాయతీ అధికారులు ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసులు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో, మొత్తం 150 మందితో కలిసి నిర్మాణాలను కూల్చివేశారు. గతంలో చీర్యాల్ పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహించిన అధికారుల సంతకాలతో అనుమతులు పొందిన దాదాపు 40 అక్రమ నిర్మాణాలను, అదే విదంగా బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన 11 మొత్తం 51 నిర్మాణాలు కూల్చివేశారు. అదే విధంగా 101, 102 సర్వే నంబర్‌లో ఏర్పాటు చేసిన అక్రమ వెంచర్‌ను అధికారులు తొలగించారు. తెల్లవారుజామున 5.30 గంటల నుండే అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తుండగా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు అడ్డుకోగా ఉద్రిక్తత నెలకొంది. ప్రజాప్రతినిధులు మీరు ఇక్కడి నుండి వెళ్లిపోండి.. మా విధులకు ఆటంకం కలిగించవద్దు అని డీపీవో వెంకయ్య ప్రజాప్రతినిధులు హెచ్చరించారు. చీర్యాల్‌కే పరిమితం కాకుండా మండల పరిధిలోని కీసర, గోధుమకుంటలో కూడా పెద్ద ఎత్తున్న అక్రమ నిర్మాణాలు జరిగాయని మాకు ఫిర్యాదు వచ్చాయి. వాటిపై కూడా సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని డీపీవో తెలిపారు. గత పాలకులు అనుమతులకు, ఇంటి నంబర్లకు అక్రమంగా లక్ష నుంచి రెండు లక్షల రూపాయాలు వసూళ్లు చేశారని, బిల్డర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా ఫోర్జరీ సంతకాలతో అనుమతులు జారీ చేసిన వారిపై పలువురు కీసర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్, ఇరిగేషన్ అధికారి ప్రశాంత్, ఎంపీవో వినూత్న, పంచాఇయతీ కార్యదర్శులు, పోలీసులు, పాల్గొన్నారు.



చీర్యాల్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న సిబ్బంది

మాతాశిశువుల రక్షణ వైద్య సిబ్బంది బాధ్యత

» డీఎంహెచ్‌వో పాల్వన్‌కుమార్



మాట్లాడుతున్న పాల్వన్‌కుమార్

వికారాబాద్, మార్చి 13 : మాతా శిశువుల ప్రాణాలు కాపాడటం జిల్లాలో పని చేస్తున్న వైద్య సిబ్బంది బాధ్యత అని డీఎంహెచ్‌వో డాక్టర్ పాల్వన్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో మాతృ,శిశు మరణాలపై పీహెచ్‌సీల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఆశలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గర్భధారణ నుంచి ప్రసవం వరకు ఎలాంటి ప్రమాదకర లక్షణాలు కనిపించినా వెంటనే సంబంధిత వైద్యాధికారి రెఫర్ చేయాలని, అవసరమైతే పైస్థాయి ఆసుపత్రులకు తీసుకెళ్లాలని సూచించారు. వైద్యుల సూచన ప్రకారం చికిత్స అందించి తల్లీబిడ్డల ప్రాణాలు కాపాడడం మన బాధ్యత అని గుర్తు చేశారు. ఏడాది లోపు పిల్లల మరణాలు చోటు చేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలు వేయాలని ఆదేశించారు. వేసవిలో ప్రజలు వడ దెబ్బకు గురి కాకుండా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.

విద్య, వైద్యరంగం పటిష్ఠానికి చర్యలు

» రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్

ఘట్‌కేసర్, మార్చి 13 : దేశంలో విద్య, వైద్య వ్యవస్థను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. బుధవారం ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రిలో గ్యాస్‌అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (గెయిల్) సమకూర్చిన సీఎస్ఆర్ నిధులతో వివిధ వైద్యపరికరాలు, నీటిశుద్ధి ప్లాంటును, ఘట్‌కేసర్ గురుకుల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి ప్లాంటును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తనచిన్న తనంలో ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రి చిన్నగా ఉండేదని గుర్తు చేశారు. తాను పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవడానికి కృషి చేస్తానన్నారు. ప్రధానంగా ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రిలో సరైన వసతులు లేవని చెప్పడంతో.. వెంటనే ఢిల్లీలోని గెయిల్ సంస్థ అధికారులతో చర్చించి సీఎస్ఆర్ నిధులతో ప్రజలకు మెరుగైన వైద్యసౌకర్యాలు కల్పించాలని కోరినట్లు వివరించారు. దాంతో ఆ సంస్థ ప్రతినిధులు ఘట్‌కేసర్‌కు వచ్చి ఆసుపత్రిని, గురుకుల్ పాఠశాలను పరిశీలించి దాదాపు రూ.70లక్షలు వెచ్చించి అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు అన్నిరకాల వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ కోట్యానాయక్ తెలిపారు. కార్యక్రమంలో అనూఫ్ గుప్తా, ముల్లి పావనీజంగయ్య యాదవ్, సింగిరెడ్డి రాంరెడ్డి, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ లక్ష్మణ్

వేసవి దుక్కులతో ప్రయోజనాలెన్నో!

- లోతు దుక్కులతో భూమిలో చీడపీడల నివారణ
- నేల గుల్లబారుతుంది.. సకాలంలో విత్తుకునే అవకాశం
- గొర్రెల మందలతో సేంద్రియ ఎరువులు లభ్యం



చేవెళ్ల, మార్చి 13: వేసవి కాలంలో పొలాలు బీడున్న సమయంలో రైతులకు పనులు లేవనుకుంటారు. కానీ అదే సమయంలో అసలుసిసలు పనులు చేపట్టాల్సింది. వేసవిలోనే వానకాలం సీజన్‌కు దుక్కులు సిద్ధం చేసుకోవాలి. వేసవి దక్కులతో పొలాలని, పంటలకు, రైతులకు అన్ని రకాలా మేలు కలుగుతుంది. వేసవిలో రైతులు చేపట్టాల్సిన పనులను. ఈ పనులతో చేకూరే ఉపయోగాలను చేవెళ్ల వ్యవసాయ శాఖ అధికారి తులసి వివరించారు. రైతులు ఈ పద్ధతులు పాటించి వానాకాలంలో సాగులో మంచి ఫలితాలు సాధించాలని ఆమె సూచించారు.

లోతు దుక్కులతో ప్రయోజనాలివే..

వేసవి దుక్కులను తేమ ఉన్న పొలాల్లో ట్రాక్టర్లు లేదా ఎడ్ల నాగళ్లతో లోతుగా దున్నాలి. దుక్కి లోతు సుమారు 9ఇంచ్‌లకు తగ్గకుండా ఉండాలి. లోతు దుక్కులతో నేల పైపొరల్లోని పురుగులు, తెగుళ్లను నశిస్తాయి. దుక్కి బాగా ఎండి వర్షపు నీటిని ఎక్కువగా పీల్చుకునే అవకాశం ఉంది. దీంతో కొన్ని సార్లు వానలు కురియడం ఆలస్యం అయినా పంట ఎండకుండా ఉంటుంది. లోతు దుక్కులతో నేలలోని పురుగులు, పంటకు హాని చేసే శిలీంధ్రాలు ఎండలకు చనిపోతాయి. వేసవిలో పంట కోతలు పూర్తయిన వెంటనే పొలాలను దుక్కులు చేసుకోవాలి.

పశువులు, గొర్రెల మందకట్టడం

ఈ పని కూడా రైతులు వేసవిలో చేసుకోవచ్చు. గతంలో ప్రతీ రైతు ఎద్దులు, ఆవులు, గేదెలతో రాత్రుళ్లు పొలంలో కట్టేసేవారు. వాటి పేడ, మూత్రం పొలానికి పంటలకు ఎరువుగా ఉపయోగపడేవి. దీంతో రైతులకు ఎరువుల ఖర్చుతగ్గేది. ఇప్పుడు పశు గణాలు బాగా తగ్గిపోయాయి. గొర్రెలను పొలంలో మందకట్టడం రైతులకు తెలిసిందే. ఇలా మందలు పెట్టడం ఎండ కాలంలోనే చేయాలి. గొర్రెల ఎరువు పంటలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. సేంద్రియ ఎరువుతో పంట నాణ్యత కూడా పెరుగుతుంది.

వేర్లు విస్తరించేందుకు అవకాశం

వేసవి లోతు దుక్కులతో తొలకరి వర్షాలకు గొర్రు తిప్పి గుంటలతో సేద్యం చేస్తే మొక్కల వేర్లు బాగా విస్తరించే అవకాశం ఉంది. నేల అధికంగా నీటిని పీల్చుకుంటుంది. సేద్యానికి ఉపయోగించే గొర్రు, గుంటక, దంతెలు వంటి పరికరాలు నేల లోపలకి 3-5 అంగుళాల లోతుకు దుక్కి చేస్తాయి. ఈ పరికరాలతో పదేపదే సేద్యం చేయడంతో నేలలో 3-5 అంగుళాల లోతులో గట్టి పొర ఏర్పడుతోంది. దీంతో నేలకు నీటిని పీల్చుకునే శక్తి తగ్గుతోంది. కాబట్టి ట్రాక్టర్ ప్లవ్ వేసి లోతుగా దున్నితే పొర ఛేదనతో నేలలో నీరు ఎక్కువగా ఇంకుతుంది. అలాగే వానకాలంలో వారం పది రోజుల వానలు కురియకున్నా మొక్కలకు నీరందే అవకాశం ఉంటుంది. అలాగే భూమిలో తేమ ఎక్కువ రోజులు ఉంటుంది. ఇలా లోతు దుక్కులు అన్ని విధాలా మేలు చేస్తాయి.

చెరువు మింగిన ఇళ్ల స్థలాలు

అమీన్‌పూర్ పెద్ద చెరువులో నీట మునిగిన ప్లాట్లు

- స్థలాలు కోల్పోయిన దాదాపు ఐదు వేల మంది బాధితులు
- పదేళ్లుగా దిగువకు నీటిని వదలకపోవడంతో పెరిగిన నీటి మట్టం
- చెరువు విస్తీర్ణం పెరిగి ప్లాట్లు కనుమరుగు
- కాగితాలకే పరిమితమైన జీవవైవిధ్యం
- మురికికూపంలా మారిన పెద్ద చెరువు
- జేఏసీగా ఏర్పడి న్యాయం కోసం పోరాడుతున్న బాధితులు



అమీన్‌పూర్ పెద్దచెరువు నీటిమట్టం పెరగడంతో నీట మునిగిన ప్లాట్లు

పటాన్‌చెరు, మార్చి 13: అమీన్‌పూర్ పెద్ద చెరువు ముంపుతో ఇండ్ల స్థలాలను కోల్పోయిన దాదాపు ఐదు వేల మంది బాధితులు తమకు న్యాయం చేయాలని కోరుతూ ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఇటీవల నిర్వహించిన సమావేశానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున ప్లాట్ల యజమానులు హాజరయ్యారు. చెరువు చుట్టుపక్కల ముంపునకు గురైన సుమారు 30 కాలనీల నుంచి తరలివచ్చారు. చిరునామా సత్యనారాయణను సారథ్యంలో జాయింట్ యాక్షన్ కమిటీని ఎన్నుకున్నారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి న్యాయం చేయమని కోరతామన్నారు.

నేపథ్యం ఇదీ..

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్దచెరువు చుట్టు పక్కల ప్రాంతంలో దాదాపు 25 ఏళ్ల క్రితం 30కి పైగా లేఅవుట్లు వేశారు. వీటిలో వేలాది మంది ప్లాట్లను కొన్నారు. అయితే, గత పదేళ్లుగా అమీన్‌పూర్ పెద్ద చెరువు నీటిని కాలువలు, తూముల ద్వారా కిందికి వదలకపోవడంతో చెరువులో నీటి మట్టం పెరిగింది. ఫలితంగా వేలాది ప్లాట్లు చెరువులో మునిగిపోయాయి. కుటుంబం కోసం, పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేసి కొనుగోలు చేసిన ఇళ్ల స్థలాలు ఇప్పుడు చేతికి రాకుండా పోవటంతో వాటిని కొన్న వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కొన్నేళ్లుగా తమ సమస్యపై ప్రభుత్వానికి విన్నవించే ప్రయత్నాలు చేసినా ఫలితం లభించలేదని చెబుతున్నారు. సదరు చెరువును జీవవైవిధ్య ప్రాంతంగా గుర్తించినందున నీటిని కిందికి వదిలేది లేదని అధికారులు అంటున్నారని పేర్కొంటున్నారు. వాస్తవానికి రెవెన్యూ రికార్డుల ప్రకారం చెరువు విస్తీర్ణం 97 ఎకరాలే అయినప్పటికీ.. నీటి మట్టం పెరిగిపోవటంతో మినీ రిజర్వాయర్‌గా తయారైంది. నిరంతరం మియాపూర్, బాచుపల్లి తదితర ఎగువన ఉన్న కాలనీల నుంచి పెద్ద ఎత్తున మురుగునీరు వచ్చిచేరడంతో నిండువేసవిలో సైతం చెరువు నిండుకుండను తలపిస్తోంది. పెద్ద చెరువు కింద మొత్తం 14 గొలుసుకట్టు చెరువులు, కుంటలు ఉన్నాయి. పెద్ద చెరువు నీటిని ఏటా దిగువకు వదలకపోవడంతో ఈ చెరువులు, కుంటలు క్రమంగా కబ్జాలకు గురై కనుమరుగవుతున్నాయి. అయినప్పటికీ, నీటి విడుదల జరగటం లేదు. పెద్ద చెరువులో చేపలు పెంచేవారు సైతం దిగువకు నీరు వదలకుండా అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. కాగా, పెద్ద చెరువు నీటి ముంపు కారణంగా ఇళ్ల స్థలాలతోపాటు వ్యవసాయ భూములు కూడా ఏళ్ల తరబడి నీట మునిగిపోతున్నాయి. దీంతో ఆయా భూముల రైతులు సాగును పక్కనపెట్టారు. విచిత్రమేమిటంటే గతంలో హుడా, హెచ్‌ఎండీఏ, పంచాయతీ అనుమతులతో వేసిన లేఅవుట్లు సైతం నీట మునిగాయి. సర్వేనెంబర్లు 196, 197, 198, 146, 149, 176, 177, 323, 324, 209, 211, 174, 199, 200, 202, 203, 205 లలోని దర్శన్‌నగర్, పాంచజన్య, వెదిరి, పద్మావతినగర్, వాణినగర్, ఆర్‌కే 1, ఆర్‌కే 2, ఆర్‌కే 3 తదితర 30 కాలనీలలోని ప్లాట్లు పెద్ద చెరువునీటిలో మునిగిపోయాయి. సుమారు ఐదువేల మంది ప్లాట్లు కోల్పోయారు. పదుల సంఖ్యలో రైతుల భూములు జలమయం అయ్యాయి. పాంచజన్య కాలనీలో ఓ ఇన్‌కంటాక్స్ అధికారి పదేళ్ల క్రితం రెండస్తుల భవనం నిర్మించిన తరువాత చెరువు నీరు పెరగడంతో దానిని అసంపూర్తిగా వదిలేశారు. పదేళ్లుగా చెరువు నీటిలోనే ఉన్న ఆ అసంపూర్తి భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది.



పాంచజన్య లేఅవుట్ జలమయం అవడంతో అసంపూర్తిగా వదిలేసిన రెండంతస్తుల భవనం

అమీన్‌పూర్ పెద్ద చెరువును జీవవైవిధ్య చెరువుగా ప్రభుత్వం గుర్తించినా గతం నుంచీ ఎలాంటి అభివృద్ధి చర్యలు చేపట్టలేదు. చెరువులోకి నిరంతరం డ్రైనేజీ, పారిశ్రామిక వ్యర్థాలు వచ్చి చేరుతున్నాయి. ఈ మురుగునీరు వల్ల.. జీవవైవిధ్యం మాట అటుంచి.. చెరువు పరిసరాలు కంపుకొడుతూ సమీపప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో చెరువునీటిని శుద్ధి చేసేందుకు ఎస్‌టీపీ ప్లాంటు ఏర్పాటు చేస్తామని హెచ్‌ఎండీఏ అధికారులు ఇచ్చిన హామీలు అమలు కాలేదు. ఇకనైనా చెరువు నీటిని దిగువకు వదిలి వాస్తవ చెరువు విస్తీర్ణాన్ని పరిరక్షిస్తూ, కలుషితం కాకుండా చూడాలని చెరువు చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారు డిమాండ్ చేస్తున్నారు.

అభివృద్ధి శూన్యం



అవార్డుతో కళాశాల చైర్మన్, సెక్రటరీలు

సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు అవార్డు

మేడ్చల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ నుంచి సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు గౌరవనీయమైన ఎకోసిస్టమ్ ఎనేబుల్డ్ ఇన్‌స్టిట్యూషన్ అవార్డు దక్కింది. ఈ మేరకు బుధవారం కళాశాల వైస్ చైర్మన్ సీహెచ్ భూపాల్‌రెడ్డి, సెక్రటరీ సీహెచ్ శ్రీశైలంరెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ కళాశాలకు అవార్డు దక్కడం అభినందనీయమన్నారు. విద్యార్థులు కళాశాలలోని సౌకర్యాలను వినియోగించుకుని భావి భారత పౌరులుగా ఎదుగాలని ఆకాంక్షించారు. ఈ అవార్డు తమ క్యాంపస్‌లోని స్టార్టప్ పర్యావరణ వ్యవస్థను పెంపొందించడంలో మా నిబద్ధతను గుర్తించాయన్నారు. డాక్టర్ కె.రాజేంద్రప్రసాద్, డీన్ ఈడీసీ ఎకోసిస్టమ్ ఎనేబుల్డ్ ఇండివిజువల్ అవార్డును పొందారు. ప్రిన్స్‌పాల్ ఎ.శ్రీనివాసులరెడ్డి ముఖ్య సూచనలు చేస్తూ హెచ్‌అండ్‌ఎస్ విభాగాధిపతి డా.కె.వీరెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, డీన్‌లు ఇతర అధ్యాపకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

యాచారంలో ఆగని దేవరకొండ డిపో బస్సులు

యాచారం, మార్చి 13 : మండల కేంద్రం గుండా హైదరాబాద్, దేవరకొండ వెళుతున్న దేవరకొండ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులను యాచారంలో ఆపడం లేదు. యాచారం మండల కేంద్రంలో బస్టాండ్ ఉన్నా ఇక్కడ బస్సు ఆపేది లేదని డ్రైవర్, కండక్టర్లు విద్యార్థులు, ప్రయాణీకులను బస్సు నుంచి దింపేస్తున్నారని, దాంతో తమకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని పలువురు ప్రయాణీకులు ఆందోళన చెందుతున్నారు. బాలికలు, మహిళలను బస్సు నుంచి దింపి అవమాన పరుస్తున్నారని పలువురు ప్రయాణీకులు చెప్పారు. ఇబ్రహీంపట్నం, దేవరకొండ డిపోల ఆర్టీసీ అధికారులు విచారణ చేసి ప్రయాణీకులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని వారు కోరుతున్నారు.

ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి

కందుకూరు , మార్చి 13 : తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతి సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో ఆమె విగ్రహానికి మండల శాలివాహన అధ్యక్షుడు బొడ్డుపల్లి రవి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఎగిరిశెట్టి బాలయ్య, ప్రధానకార్యదర్శి ఆలూరి జంగయ్య, కార్యదర్శి రమేశ్, ఉపాధ్యక్షుడు సురేశ్, ఈశ్వర్, శివ, కోశాధికారి లింగం, నరేష్, ఉన్నారు.

యాచారం : కుమ్మరులు సమాజ సేవకు అంకితం కావాలని మండల కుమ్మర సంఘం నాయకుడు నడికూడి కృష్ణ అన్నారు. బుధవారం యాచారం మండలంలోని గున్‌గల్‌లో మొల్ల విగ్రహాన్ని ఆ సంఘ నాయకులు ఆవిష్కరించి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల సొసైటీ చైర్మన్ టి. రాజేందర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కె,యాదయ్య, భీమ్‌యాదవ్, మాజీ వైస్‌ఎంపీపీ రామకృష్ణయాదవ్, ఉన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

మసీదుల వద్ద సౌకర్యాలు కల్పించాలి

వికారాబాద్, మార్చి 13: మసీదుల వద్ద తగిన సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభమైన సందర్భంగా వికారాబాద్ పట్టణంలోని మసీదుల వద్ద పారిశుధ్య నిర్వహణ, వీధిదీపాలు, మంచినీటి సదుపాయం కల్పించాలని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులకు ముస్లిం మైనారిటీ నాయకులు మెమోరాండం అందించారు. అందుకు వెంటనే స్పందించిన చైర్‌పర్సన్ మంజులరమేష్.. మున్సిపల్ అధికారులతో మాట్లాడి మసీదుల వద్ద పారిశుధ్య నిర్వహణతో పాటు ఎక్కడైతే వీధిదీపాలు లేవో అక్కడ వెంటనే ఏర్పాటు చేసి, తాగునీటి సదుపాయం కల్పించాలని బుధవారం అధికారులను ఆదేశించారు. అడిగిన వెంటనే స్పందించడంతో చైర్‌పర్సన్‌కి మైనారిటీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. చైర్‌పర్సన్‌ని కలిసిన వారిలో కోఆప్షన్ సభ్యులు, ఎర్రవల్లి జాఫర్, వికారాబాద్ నియోజకవర్గం మైనారిటీ చైర్మన్ సర్ఫరాజ్, వికారాబాద్ పట్టణ మైనారిటీ ప్రెసిడెంట్ హాజీ పాషా, వికారాబాద్ పట్టణ మైనారిటీ వైస్ ప్రెసిడెంట్ ఫరూక్, వికారాబాద్ టౌన్ జనరల్ సెక్రెటరీ ముస్తాక్, కొత్తగాడి ఉస్మాన్ , జహంగీర్, మహమ్మద్, లాల్ మహమ్మద్, జిలాని, ఖలేద్, మౌలానా, కుటుబ్దిన్ తదితరులు ఉన్నారు.

ఘట్‌కేసర్‌లో బీఆర్ఎస్‌కు భారీ షాక్

- పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాంగ్రెస్‌లో చేరిక



సహకార సంఘం ఉపాధ్యక్షుడు బద్దం అనంతరెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, వజ్రేష్ యాదవ్

ఘట్‌కేసర్, మార్చి 13 : ఘట్‌కేసర్‌లో బీఆర్ఎస్ పార్టీకి భారీషాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన పీఏసీఎస్ వైస్ చైర్మన్ బద్దం అనంతరెడ్డి ఆయన కుమారుడు, నర్సింహరెడ్డితో పాటు దాదాపు 200 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం రాత్రి పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలోని ఎస్‌బీఆర్ గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, డీసీసీ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్న ప్రత్యేక సమావేశంలో అనంతరెడ్డితోపాటు మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలకు చెందిన యువకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ మాల్లారెడ్డి లాంటి భూ కబ్జాదారులను పార్టీలోకి చేర్చుకోవడాన్ని పార్టీ ముక్తకంఠంతో వ్యతిరేకిస్తుందన్నారు. అయినా అనేక మంది కాంగ్రెస్‌లో చేరడానికి ఉత్సాహం చూపుతున్నారని అన్నారు. పార్టీలో చేరాలనుకుంటున్న వారిని స్థానిక కమిటీల నిర్వాహకులు వెళ్లి కలిసి ఆహ్వానించాలని కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయం సాధించేందుకు కార్యకర్తలు ఇప్పటి నుంచే ప్రచారం ముమ్మరం చేయాలన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి, కొంతం అంజిరెడ్డి, మహేష్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, చిన్న నర్సింహగౌడ్, శ్రీశైలం, గణేష్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

- ఐదు రోజుల పాటు నిర్వహణ
- 18న స్వామివారి కల్యాణం, 19న రథోత్సవం



ఆమనగల్లు, మార్చి 13 : జిల్లాలో ప్రసిద్ధ ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న ఆమనగల్లు పట్టణంలోని అలివేలుమంగ సమేత శ్రీ వేంకటగిరి వేంకటేశ్వర స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. ప్రతి ఏటా పాల్గుణ శుద్ధసప్తమి మొదలు పాల్గున శుద్ధ ఏకాదశి వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు ఇక్కడ కన్నుల పండువగా నిర్వహిస్తారు. జిల్లా నలుమూలల నుంచే కాక మహబూబ్‌నగర్, హైదరాబాద్, నల్గొండ, నాగర్‌కర్నూల్, జిల్లాల నుంచి ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. ఈనెల 16 నుంచి మార్చి 20 వరకు కొనసాగే బ్రహ్మోత్సవాల కోసం ఆలయం వద్ద నిర్వాహకులు విశాల వసతులు ఏర్పాటు చేశారు.

బ్రహ్మోత్సవాల వివరాలు

బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ ప్రధాన అర్చకుడు గూడ క్రిష్ణమాచార్య చెప్పారు. 16న విశ్వక్సేన ఆరాధన, పున్యహవాచనం, అంకురార్పణం, దేవతాహ్వానం, భేరి పూజ, 17న సుప్రభాతసేవ, నిత్యారాధన, మహాభిషేకం, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, బలిహరణం, ఎదుర్కోళ్లు, 18న అలివేలు మంగ వేంకటేశ్వరస్వామి కళ్యాణం, 19న రథోత్సవం, అదేరోజు రాత్రి దీపోత్సవం, 20న చక్రతీర్థం, పూర్ణాహుతి, నాగవళి, దేవతాఉద్వాసన కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కృష్ణమాచార్య కోరారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో టీచర్లు

జిల్లాస్థాయి భగవద్గీత శ్లోకాల పోటీల్లో సంకల్ప్ విద్యాపీఠం విద్యార్థుల సత్తా

వికారాబాద్, మార్చి 13 : ఇటీవల ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి భగవద్గీత శ్లోకాల పోటీలో వికారాబాద్ పట్టణంలోని సంకల్ప్ విద్యాపీఠం విద్యార్థులు సత్తా చాటారని పాఠశాల చైర్మన్ ధనశెట్టి మళిగి, ప్రిన్సిపాల్ ప్రభాకర్‌లు తెలిపారు. ఈ పోటీల్లో 7వ తరగతికి చెందిన తిరుమల్ తనుశ్రీకి మొదటి బహుమతిగా సైకిల్‌ను, 9వ తరగతికి చెందిన భువన కృతి, 10 వ తరగతికి చెందిన ప్రణవిరెడ్డి, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించినట్లు తెలిపారు. ఈమేరకు బుధవారం వారిని చైర్మన్ ధనశెట్టి మళిగి, ప్రిన్సిపాల్ ప్రభాకర్, ఉపాధ్యాయులు అభినందించారు.

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ఆరుట్లలో శిథిలావస్థకు చేరిన పెంకుటిల్లును పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేతలు

మంచాల, మార్చి 13 : అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తామని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ సీనియర్ నాయకుడు బుగ్గరాములు, మాదగోని జంగయ్యగౌడ్‌లు అన్నారు. బుధవారం పార్టీ నేతలతో కలిసి ఆరుట్లలో శిథిలావస్థకు చేరిన ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ మానిఫెస్టోలో పేర్కొన్న ఆరుగ్యారెంటీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. పేదలకు ఇంటినిర్మాణం కోసం ఐదులక్షల నిధులను మంజూరు చేస్తుందని హామీఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రావులబాష, దాసరమోని రమేష్, బుగ్గరాములు, బుట్టికృష్ణ, అశోక్, శ్రవణ్, భాస్కర్, ప్రభాకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్‌పై ఆశలు!

- మార్కెట్ కమిటీ చైర్మన్ పదవుల కోసం తీవ్ర పోటీ
- ఆశావహుల ప్రయత్నాలు.. అధిష్ఠానం చుట్టూ ప్రదక్షిణలు





పరిగి, మార్చి 12: నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్న నాయకులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజులు కావస్తోంది. కొత్త గా మార్కెట్ కమిటీల పాలకవర్గాలను నియమిస్తామని ఇటీవల మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించిన సంగతి విదితమే. ఇటీవల రాష్ట్రంలోని కొన్ని మార్కెట్ కమిటీ లకు ఇప్పటికే పాలకవర్గాలను నియమించింది. పరిగి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో పరిగి, కులకచర్ల మార్కెట్ కమిటీలకు పాలకవర్గాల నియాకమంపై ఆశలు పెట్టుకున్న అభ్యర్థులు డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలలోపు కొన్ని పాలకవర్గాలను నియమిస్తారన్న ప్రచారంతో అశావహులు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. లోక్‌సభ, సర్పంచులు, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలకోడ్‌తో ఆరు మాసాలపాటు ఆగాల్సి ఉంటుంది. అందువల్ల ఎన్నికలకోడ్ రాకముందే పాలకవర్గాల నియయాకాలు చేపట్టాలని పార్టీ శ్రేణులు, అధిష్ఠానంపై ఒత్తిడి పెంచుతున్నారు. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో నాయకులు నామినేటెడ్ పదవులపై గంపెడాశలు పెట్టుకున్నారు. పరిగి, కులకచర్ల మార్కెట్ కమిటీల్లో పదవుల కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అధిష్ఠానం కూడా అనుచర గణాన్ని పిలిపించుకుని అభ్యర్థుల ఎంపికపై సమాలోచనలు జరుపుతున్నారు. పరిగి మార్కెట్ కమిటి పదవికి తీవ్ర పోటీ ఉంది. చైర్మన్ పదవికి జనరల్ కేటగిరి నుంచి రంగంపల్లి కృష్ణారెడ్డి, బి.పరుశరాంరెడ్డి, అభిరామ్, కడ్మూరిశ్రీనివాస్, పాలాది శ్రీనివాస్, బీసీ కేటగిరి నుంచి పి.చిన్న నర్సింహులు, ఆనంద్‌గౌడ్, అశ్రఫ్, ఆనెం అంజనేయులు, యు.శివకుమార్, ఎస్సీ కెటగిరి నుంచి ఇ.కృష్ణ, ఎస్.రామకృష్ణ, మహిపాల్, తదితరులు పోటీ పడుతున్నారు. కులకచర్ల కమిటీ చైర్మన్ పదవిని శ్రీధర్‌రెడ్డి, బీఎస్ అంజనేయులు, భరత్‌కుమార్, బాలముకుందం, అంజిలయ్యగౌడ్‌లు ఆశిస్తున్నారు. చైర్మన్ పదవి తమకే అంటే, తమకే వస్తుందని ధీమాతో ఉంటున్నారు. అయితే పాలకవర్గాలు నియామకాలు ఎప్పుడు జరుగుతాయనే దానికోసం ఇక వేచిచూడాల్సిందే మరి!



విలేకరులతో మాట్లాడుతున్న రవిశంకర్‌రెడ్డి

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

కొడంగల్, మార్చి 13: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని ఆర్‌ఎస్‌యూ (రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్) వ్యవస్థాపక అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కొడంగల్‌లో తెలంగాణ రాష్ట్ర నూతన కార్యవర్గ సమావేశాన్ని సంఘం నాయకుడు భీమారాజ్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ రంగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలన్నారు. అనంతరం ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా చంద్రశేఖర్, అధ్యక్షుడిగా భీమారాజ్, ప్రధాన కార్యదర్శిగా సురేశ్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా బాల్‌రాజ్‌గౌడ్, ప్రభాకర్, సహాయ కార్యదర్శులుగా రమేశ్, కేశవులు, శ్రీకాంత్, కోశాధికారిగా చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు.

ముగిసిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు

మేడ్చల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఇంటర్ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. బుధవారం విద్యార్థులు బయోలాజికల్ సైన్స్ పరీక్ష రాశారు. జిల్లావ్యాప్తంగా 139 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా చివరిరోజు 70,431 మంది విద్యార్థులకుగాను 68,558మంది పరీక్షకు హాజరయ్యారు. 1873మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు నోడల్ అధికారి కిషన్ తెలిపారు.

ఘనంగా పార్వతీదేవి కల్యాణం

● సంగామేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు.. పల్లకీసేవ

మర్పల్లి, మార్చి 13: మండల కేంద్రంలోని సంగమేశ్వర స్వామి ఆలయం 24వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామస్థులు తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం పార్వతీ, సంగమేశ్వర విగ్రహాలతో పల్లకీసేవ నిర్వహించారు. సంగమేశ్వరాలయానికి మర్పల్లి మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దలు మల్లేపల్లి శ్రీరామప్ప, సిద్దురాములు, మల్లేశం పటేల్, ఆకుల నర్సిములు, గాండ్ల ప్రభు, ప్రధాన అర్చకులు చంద్రయ్య, ఆలయ అర్చకులు కేవీఎస్ శర్మ భక్తులు నిర్వాహకులు పాల్గొన్నారు.

ముగిసిన దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన

పూడూరు : మండలంలోని చీలాపూర్ గ్రామంలో మూడు రోజులపాటు దేవతామూర్తుల ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బీరప్ప, మల్లన్న ఆలయాల్లో మహంకాళి, బీరప్ప, మల్లన్న, వినాయక, శిఖర, నంది విగ్రహాలను ప్రతిష్ఠించారు. బుధవారం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కడుమూరు ఆనందం తదితరులు దేవతామూర్తులను దర్శించుకున్నారు. ఉదయం అర్చకులు సుప్రభాతసేవ, నూతన విగ్రహాల ఊరేగింపు, అగ్నిప్రతిష్ఠ, గణపతి, నవగ్రహాల కుహోమాలు, జలాధివాసం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉపసర్పంచ్ రామకృష్ణారెడ్డి, రామస్వామి, వీరప్ప, రాంచంద్రయ్య, గ్రామస్థులున్నారు.


మర్పల్లి : సంగమేశ్వరుడు, పార్వతీదేవిల పల్లకీ సేవలో భక్తులు; దేవతామూర్తులు(ఇన్‌సెట్లో)


నవాబుపేట : వేంకటేశ్వరాలయంలో జడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి

వేంకటేశ్వరస్వామి సేవలో జడ్పీ చైర్‌పర్సన్

నవాబుపేట : కులమతాలకతీతంగా జాతర నిర్వహించడం అభినందనీయమని వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని చిట్టిగిద్ద గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో జాతర వైభవంగా నిర్వహించారు. సునీత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు కె.బందెయ్యగౌడ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పామెన జ్యోతీ భీంభరత్, మహిళా నాయకురాలు బాలమణి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయం వద్ద అన్నదానం

శామీర్‌పేట : మండలంలోని తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని ఉప్పరిపల్లిలోని శ్రీపెద్దమ్మతల్లి ఆలయం వద్ద బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. హైదరాబాద్ వాస్తవ్యులు ప్రమోద్‌కుమార్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. వివిధ ప్రాంతాల భక్తులు పెద్దఎత్తున పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.


పూడూరు : చీలాపూర్‌లో కాళీమాతను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

క్రైం కార్నర్

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య


నర్సింహులు (ఫైల్)

పరిగి, మార్చి 13: ఓ వ్యక్తి బ్రిడ్జి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పరిగి మునిసిపల్ పరిధిలోని నాయికోటివాడకు చెందిన కడగట్ల చిన్ననర్సింహులు(48).. పరిగి మండలం సుల్తాన్‌పూర్ శివారులోని బ్రిడ్జి వద్ద బుధవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, నర్సింహులు వృత్తిరీత్యా గొంగళ్ల వ్యాపారి. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. కుటుంబ కలహాలే కారణమై ఉంటాయని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

భార్యతో గొడవపడి ప్రియురాలి ఇంట్లో వ్యక్తి..


స్వామి(ఫైల్)

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 13 : భార్యతో గొడవపడి ఓ వ్యక్తి ప్రియురాలి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి-భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం రాఘవాపురంనకు చెందిన రక్షని స్వామి(37) మద్యంమత్తులో భార్య భవిత అలియాస్ కళ్యాణితో గొడవపడి మంగళవారం రాత్రి ఘట్‌కేసర్ మండలం అవుషాపూర్‌లోని ప్రియురాలు దీపిక ఇంటికి వచ్చాడు. అయితే, ఆరోజు దీపిక భర్త ఇంట్లో లేడు. బుధవారం తెల్లవారుజామున స్వామి దీపిక ఇంట్లోని వంటగదిలో అనుమానాస్పదస్థితిలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న దీపిక ఇబ్రహీంపట్నంలోని తన భర్త ముఖేష్‌కు స్వామి మృతిచెందిన విషయం చెప్పింది. అతను హుటాహుటిన ఇంటికి చేరుకొని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు పరిసరాలను పరిశీలించి మృతదేహాన్ని గాంధీకి తరలించారు. స్వామి మృతిచెందిన విషయాన్ని అతడి భార్య కళ్యాణికి చెప్పారు. కాగా, తన భర్తకు దీపికకు గత కొన్నిరోజులుగా అక్రమసంబంధం ఉందని, తన భర్త మరణంపై పలు అనుమానాలు ఉన్నాయని కళ్యాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆటో బోల్తా.. ఒకరి మృతి


అఫ్జల్(ఫైల్)

కీసర రూరల్, మార్చి 13 : ఆటో బోల్తాపడిన ఘటనలో ఒకరు మృతి చెందారు. బుధవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ సంఘటన చోటు చేసుకుంది. సీఐ వెంకటయ్య కథనం ప్రకారం.. కీసర మండలం బోగారం గ్రామానికి చెందిన అఫ్జల్(32) ఫొటోగ్రాఫర్. పని నిమిత్తం స్నేహితుడితో కలసి అతని ఆటోలోనే సమీపాన ఉన్న జమిలాపేట్ గ్రామానికి వెళ్లారు. పని ముగించుకుని తిరిగి ఇంటికి బయలుదేరారు. ఈక్రమంలో బోగారం అనుబంధ గ్రామం బర్సిగూడ సమీపంలో మూలుమలుపు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. అఫ్జల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సాయంతో ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆటో నడుపుతున్న వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గృహిణి అదృశ్యం.. కేసు నమోదు


స్నేహలత (ఫైల్)

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 13 : గృహిణి అదృశ్యమైన సంఘటన పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడకు చెందిన కుప్ప వీరనాగు సుబ్రమణ్యంకు అదే ప్రాంతానికి చెందిన స్నేహలతతో రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం జరిగింది. ఉపాధికోసం రెండునెలల క్రితం సుబ్రమణ్యం భార్యతో కలిసి పోచారం మున్సిపాలిటీ జోడిమెట్లలోని వైష్ణవి బాలికల హాస్టల్‌లో వంటమనిషిగా పనికి కుదిరాడు. ఫిబ్రవరి 26న సుబ్రమణ్యం కాకినాడలోని బంధువుల పెళ్ళికి వెళదామని భార్యకు చెప్పాడు. దాంతో తాను రానని నువ్వు ఒక్కడివే వెళ్లమని భర్తకు చెప్పింది. అతడు కాకినాడకు బయలుదేరి వెళ్ళాడు. సుబ్రమణ్యం ఈ నెల 2న కాకినాడ నుంచి తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి భార్య కనిపించలేదు. బంధువులు, తెలిసిన వారివద్ద విచారించినా లాభం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అన్నం సరిపడా వండలేదని.. భార్యాభర్తలపై దాడి.. హాస్టల్ నిర్వాహకుడిపై కేసు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 13 : విద్యార్థులకు సరిపడా అన్నం వండలేదని భార్యాభర్తలను చితకబాదిన ఓ హాస్టల్ నిర్వాహకుడిపై పోచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం కేసు నమోదైంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. మహబుబాబాద్ జిల్లా మరిపేటబంగ మండలం సోమ్లా తండాకు చెందిన భూక్య నరేష్. భార్య సునీతతో కలిసి పోచారం మున్సిపాలిటీ యంనంపేట్‌లో ఉంటూ స్థానిక కృష్ణవేణి బాలికల హాస్టల్‌లో విద్యార్థులకు వంట చేస్తుంటాడు. కాగా, అతడు ప్రతీరోజు 120మంది విద్యార్థులకు వంట తయారుచేస్తుంటాడు. ఈక్రమంలో హాస్టల్ నిర్వాహకుడు వరుణ్‌రెడ్డి.. విద్యార్థులకు సరిపోను వంట చేయడం లేదని బుధవారం నరేష్‌ను దుర్భాషలాడుతూ కర్రతో దాడిచేశాడు. అడ్డుకున్న భార్య సునీతపై సైతం దుర్భాషలాడుతూ దాడిచేశాడు. దాంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మూడు దుకాణాల్లో చోరీ.. రూ.8వేలు అపహరణ

వికారాబాద్, మార్చి 13 : వికారాబాద్ పట్టణంలో మూడు దుకాణాల్లో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి సమీపంలోని ఓ కిరాణా దుకాణంలో గుర్తుతెలియని దుండగులు తలుపులు విరగ్గొట్టి గల్లాలో ఉన్న డబ్బులు దొంగలించారు. అనంతరం రెండు డయాగ్నస్టిక్ ల్యాబ్‌ల్లో సైతం తాళాలు విరగ్గొట్టి కొంత నగదు దొంగలించారు. మొత్తం మూడు దుకాణాల్లో కలిసి రూ.8వేలు అపహరించుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేపట్టినట్లు సీఐ నాగరాజు తెలిపారు.

తాగిన మైకంలో యువకుడు హల్‌చల్

● విద్యుత్ స్తంభం ఎక్కిన వైనం.. కిందికి దించిన యువకులు

వికారాబాద్, మార్చి 13 : గుర్తు తెలియని ఓ వ్యక్తి తాగిన మైకంలో విద్యుత్ స్తంభం ఎక్కి హల్‌చల్ చేశాడు. ఈ ఘటన బుధవారం రాత్రి వికారాబాద్ పట్టణంలోని ప్రధాన రోడ్డులో గల తారాచంద్ స్వీట్‌హౌజ్ వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి ఓ వ్యక్తి 33/11 కేవీ విద్యుత్ స్తంభం ఎక్కాడు. గమనించిన స్థానికులు కిందకు దిగాలని ఎంతచెప్పినా వినలేదు. పోలీసులకు సమాచారమివ్వడంతో వారితో పాటు ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ముందు జాగ్రత్త చర్యగా విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. కాగా, అతడు కిందకు దూకుతాడేమోనని జనం ఆందోళన చెందారు. స్థానిక యువకులు చాకచక్యంగా స్తంభం ఎక్కి అతడిని కిందకు దింపి పోలీసులకు అప్పగించారు. అతడు ఎందుకు స్తంభం ఎక్కాడనే కారణాలు ఇంకా తెలియరాలేదు.

ఆరోగ్యకర జీవనానికి క్రీడలు దోహదం


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి

వికారాబాద్, మార్చి 13 : ఆరోగ్యకరమైన జీవన విధానానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని బీజేపీ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. వికారాబాద్‌లో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల పట్ల మక్కువ పెంచుకుంటే యువతను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచుతాయని చెప్పారు. సామాజిక నిర్మాణంలో భాగంగా గ్రామాల్లో రోడ్లు, లైట్లు తదితర సౌకర్యాల వలే ఒక ఆట స్థలం కూడా ఉండాలన్నారు. గోధుమగడ్డ గ్రామంలో క్రీడలు బాగా ఆడతారని ఆయన అన్నారు. జేకేఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏడాదికి మూడు, నాలుగుసార్లు క్రీడలు నిర్వహిస్తున్నామని చెప్పారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు దాదాపు 500 టేబుల్ టెన్నిస్ టేబుల్స్‌ను పాఠశాలలకు ఇచ్చానన్నారు. 23 యూత్ క్లబ్‌లు ఏర్పాటు చేశానన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

మేడ్చల్ టౌన్, మార్చి 13 : మున్సిపల్ పరిధిలో వ్యాపారాలు చేసుకునే సంస్థల యజమానులు నేరుగా ట్రేడ్ లైసెన్స్‌కు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మేడ్చల్ కమిషనర్ నాగిరెడ్డి కోరారు. మున్సిపల్‌కు ఆదాయం చేకూరే ట్రేడ్‌లైసెన్స్‌ల పట్ల ప్రత్యే దృష్టి సారిస్తున్నామన్నారు. చాలామంది వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్స్ కోసం తమ కార్యాలయం చుట్టూ తిరగటం ఆనవాయితీగా మారిందన్నారు. మున్సిపల్ కార్యాలయంలో పన్నులు చెల్లించటం, ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యూవల్ చేయటం, కొత్త వాటి కోసం దరఖాస్తు చేసుకోవటం లాంటివి సులువుగా ఆన్‌లైన్ పద్ధతిలో చేసుకునే వీలు కల్పించామని తెలిపారు. అదేవిధంగా ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. దాదాపు రూ.10 కోట్ల వార్షిక ఆదాయం పన్నుల రూపకంగా మున్సిపల్‌కు వస్తుందన్నారు. ఈసారి మార్చి 31వరకు 90 శాతానికి తగ్గకుండా ట్యాక్సులు వసూలు చేసేందుకు తమ సిబ్బంది ఇంటింటికీ తిరుగుతున్నారని తెలిపారు. 31లోపు ట్యాక్సు చెల్లించని వారు అదనంగా జరిమానా చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. మొండి బకాయిలు వసూలు చేయటానికి నోటీసులు జారీ చేశామని తెలిపారు. అవసరమైతే ట్యాక్సులు చెల్లించని వారి సామగ్రి జప్తు చేస్తామని తెలిపారు. ట్రేడ్‌లైసెన్స్ ఉన్న వ్యాపారస్తులు 31లోపు లైసెన్స్ రెన్యూవల్ చేసుకోవాలని కమిషనర్ కోరారు.

మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు


మాట్లాడుతున్న ఏపీఎం ఆనంద్‌కుమార్

తాండూరు రూరల్, మార్చి 13 : ప్రభుత్వం మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తుందని ఐకేపీ ఏపీఎం ఆనంద్‌కుమార్ అన్నారు. బుధవారం తాండూరు మండలంలోని చెనిగేష్‌పూర్‌లో గ్రామసభ నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ బ్యాంకు నుంచి రుణాలు పొందిన మహిళలు బకాయిలు లేకుండా రుణాలు కట్టుకొని సంఘాలను బలోపేతం చేసుకోవాలని సూచించారు. మహిళా సంఘాల సభ్యులకు రూ.5లక్షల జీవిత బీమా అందజేస్తున్నట్లు చెప్పారు. చెనిగేష్‌పూర్‌లో ఇప్పటి వరకు బ్యాంకు లింకేజీ కింద మహిళా సంఘాలకు రూ.3కోట్ల రుణాలు, మహిళా సమాఖ్య కిందరూ.4లక్షల రుణాలు అందజేసినట్లు చెప్పారు. సీసీ వెంకటేష్, వీవోఏ సంతోషిణి పాల్గొన్నారు.

రూ.5లక్షలతో డ్రైనేజీ నిర్మాణం


డ్రైనేజీ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న నాయకులు

తాండూరు రూరల్, మార్చి 13 : తాండూరు మండలంలోని కోణాపూర్‌లో రూ.5లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టారు. కొన్నేళ్లుగా గ్రామంలో ప్రజలు డ్రైనేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.5లక్షల నిధులతో గ్రామంలో కొత్తగా డ్రైనేజీని నిర్మిస్తున్నారు. ఈమేరకు సీనియర్ నాయకులు ఆర్.వెంకటేశం, రాజులు బుధవారం డ్రైనేజీని పరిశీలించారు. వారు మాట్లాడుతూ గతంలో మాజీ ఎమ్మెల్యేలు మహేందర్‌రెడ్డి, నారాయణరావుల హయాంలో గ్రామంలో సమస్య పరిష్కరించలేదన్నారు. మనోహర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందిన కొన్ని నెలల్లోనే గత 50ఏళ్లుగా తీరని డ్రైనేజీ సమస్యను పరిష్కరించారని అన్నారు. ఉపసర్పంచ్ రాజు, కాంగ్రెస్ నాయకులు వెంకటయ్య, ఆర్. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ జెండాలు మోసిన వారికి గుర్తింపేది?

● కాంగ్రెస్ నాయకుల ఆవేదన

ఘట్‌కేసర్, మార్చి 13 : కాంగ్రెస్‌లో పదేళ్లుగా కష్టపడి పార్టీ జెండాలు మోసిన వారిని పక్కనబెట్టి కనీస సమాచారం లేకుండానే ఇతర పార్టీల వారిని చేర్చుకోవడంపై కాంగ్రెస్ పార్టీ పోచారం మున్సిపాలిటీ అధ్యక్షుడు సిగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మెట్టు గణేష్‌తో పాటు పలువురు నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం అన్నోజిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అనేక మంది పార్టీ వైపు చేస్తున్నారని గుర్తుచేశారు. పైన ఉన్న ఇన్‌చార్జితోపాటు పలువురిని కలిసి ఇరత పార్టీల నాయకులు పార్టీలో చేరుతున్నారని అన్నారు. ఇంత కాలం ఎవరిపై తాము ఉద్యమం చేసామో.. వారే నేడు మాపై స్వారీ చేయడానికి వస్తున్నారని, అలాంటి వారిని పార్టీలో చేర్చుకునే ముందు ఒక్కసారైనా తమతో చర్చించమని చెప్పారా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా పార్టీ అధిష్ఠానం ఆయా పార్టీల వారి చేరికల విషయంలో మండల, మున్సిపాలిటీల, గ్రామ కమిటీల నిర్వాహకులతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని హితులు పలికారు. సమావేశంలో కొంతం శంకర్‌రెడ్డి, ఎర్ర రాజు, మల్లిఖార్జున్‌రెడ్డి, మహదేవ్, లక్ష్మణ్, పోశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు ఆర్థిక సాయం

కులకచర్ల, మార్చి 13: మండలంలోని హన్మ్యానాయక్ తండా పంచాయతీ పరిధిలోని హీర్యానాయక్‌తండాలో అనాథ బాలికలకు బీజేపీ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. ఈమేరకు నలుగురు అనాథ బాలికలను గుర్తించి వారికి ఒక్కొక్కరికి రూ.2,500 చొప్పున చెక్కులతో పాటు బ్యాగులు, క్యాలెండర్లు అందజేశారు. బీజేపీ నాయకులు ఆంజనేయులు, అంజిలయ్య, ప్రభు, గోపాల్, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

అనుబంధ గ్రామాలు, తండాల్లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటు


రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన ఆర్డీవో

● రెండు కిలోమీటర్ల పైబడి ఉన్నవాటికి వర్తింపు
● రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో

తాండూరు/పెద్దేముల్, మార్చి 13 : రెండు కిలోమీటర్ల పైబడి ఉన్న అనుబంధ గ్రామాలు, తండాలకు సంబంధించి ఎనిమిది నూతన పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన కార్యాలయంలో తాండూరు నియోజకవర్గంలోని రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ నియోజకవర్గం మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా కోడ్ కిందికి వస్తుండటంతో వికారాబాద్ జిల్లా మొత్తం ఎలక్షన్ కోడ్ వర్తిస్తుందన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించి వాల్ రైటింగ్స్, పోస్టర్లు, బ్యానర్లు తొలగించాలని ఈ సందర్భంగా కోరారు. మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలకు, తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేశారు. తాండూరు తహసీల్దార్ తారాసింగ్, రెవెన్యూ సిబ్బంది, పాల్గొన్నారు.

పెద్దేముల్ మండలంలో 8 పోలింగ్ కేంద్రాలు

పెద్దేముల్ మండలంలో ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన తండాలు, గ్రామాలను గుర్తించి వాటిలో 8 నూతన పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడానికి అధికారులు సీఈవో కార్యాలయానికి ప్రతిపాదనలు పంపించారు. ఊరెంటితండా, సిద్దన్నమడుగుతండా, ఎర్రగడ్డతండా, జయరాంతండా(ఐ), ఖానాపూర్, కందనెల్లితండా, మారెపల్లితండా, బండపల్లి గ్రామాల పేర్లను అధికారులు సీఈవోకు పంపినట్లు చెప్పారు.

సీఎం రేవంత్ చిత్రపటాలకు పాలాభిషేకం


తాండూరు : రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

● ఆర్యవైశ్య, ముదిరాజ్‌లకు కార్పొరేషన్ల ఏర్పాట్లపై హర్షం

పరిగి, మార్చి 13: ఆర్యవైశ్య కార్పొరేషన్ ప్రకటించడాన్ని స్వాగతిస్తూ.. పరిగి సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సంఘం పరిగి అధ్యక్షుడు పి.మధుసూదన్, మహిళా అధ్యక్షురాలు సువర్ణలు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషిచేస్తానని ప్రకటించిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం నాయకులు వేముల కిరణ్, పాలాది శ్రీనివాస్, ఎ.రాజు, ఆకుతోట సత్యనారాయణ, వీరమణి, బాదాం శ్రీనివాస్, సోమరమేశ్, విజయ్, జగన్ ఎదిరె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాండూరు : ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు నిర్ణయాన్ని హర్షిస్తూ బుధవారం తాండూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ, యాలాల ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తాలు పాల్గొని మాట్లాడుతూ పదేళ్ల పోరాటం తర్వాత ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలపడం హర్షనీయమన్నారు. క్యాబినెట్ నిర్ణయాన్ని వెంటనే అమలుపరిచి రూ.5వేల కోట్ల నిధులు కేటాయించి వైశ్యులకు ఉపయోగపడే విధంగా మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు. సంఘం అధ్యక్షుడు కటకం వీరేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ కొట్రిక విజయలక్ష్మి, సంఘం కార్యదర్శి కోట మురళీకృష్ణ, సంఘం నాయకులు పాల్గొన్నారు.

కొడంగల్ : రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని నిర్ణయించడం హర్షణీయమని ఆ సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు కటకం శివకుమార్‌గుప్త అన్నారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో ఆర్యవైశ్యులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉండి కార్పొరేషన్ ఏర్పాటు చేయలేదని విమర్శించారు. సంఘం నాయకులు నందారం ప్రశాంత్, నారాయణ, చంద్రమోహన్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధారూరు : ముదిరాజ్‌లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయటంపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం సాయంత్రం ధారూరులో ముదిరాజ్ సంఘం నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినందున రేవంత్‌రెడ్డికి, స్పీకర్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. యువజన కాంగ్రెస్ వికారాబాద్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అశోక్ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం నాయకులు వెంకట్, సంగమేశ్వర్, మల్లేశ్, శ్రీనివాస్, యాదగిరి, కృష్ణ, చంద్రయ్య, శివ, నారాయణ, సుభాష్, శాంతప్ప ముదిరాజ్‌లున్నారు.


కొడంగల్ : రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

'పది'లో మంచి మార్కులు సాధించాలి : ఎంపీపీ

కొడంగల్, మార్చి 13: విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ అన్నారు. బుధవారం కొడంగల్ పట్టణంలోని శ్రీ బాలాజీ కేజీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం, పాఠశాల వార్షికోత్సవాన్ని జరుపుకున్నారు. విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లను ఎంపీపీతో పాటు పాఠశాల జాయింట్ సెక్రటరీ లోకూర్తి జయతీర్థచారి, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, జి.రాంరెడ్డి, ఉపాధ్యాయులు అందజేశారు. ఉపాధ్యాయులకు విద్యార్థులు శాలువాలతో సన్మానం చేశారు. విద్యార్థులు చేసిన సాంస్కృతి కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, సత్యనారాయణ, లక్ష్మి, విద్యాకమిటీ మాజీ చైర్మన్ రాజేశ్వర్, ప్రాథమిక పాఠశాల విద్యాకమిటీ మాజీ చైర్మన్ బద్దం కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


మర్పల్లి : వీడ్కోలు సమావేశంలో విద్యార్థులు, టీచర్లు

ప్రణాళికబద్ధంగా చదివితే మంచి ఫలితాలు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 13 : పదవ తరగతి విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివితే మంచి ఫలితాలు వస్తాయని ప్రతాప్‌సింగారం జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ తెలిపారు. మండలంలోని ప్రతాప్‌సింగారం జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం పదవ తరగతి విద్యార్థులకు హాల్‌టికెట్‌లు అందజేశారు. అనంతరం ఫెర్వేల్ పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వారం రోజులు పదవ తరగతి విద్యార్థులు సమయం వృధాచేయకుండ చదువాలని సూచించారు. టీవీలు, ఫోన్‌లకు దూరంగా ఉండాలని తెలిపారు. ప్రణాళికబద్ధంగా చదివితే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు.

పాఠశాలకు మంచిపేరు తేవాలి

మర్పల్లి : రాబోయే పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు పేరు తీసుకురావాలని మర్పల్లి జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం కె.శ్రీశైలం అన్నారు. బుధవారం పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పది సంవత్సరాల పాటు పాఠశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులు తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. హెచ్ఎం శ్రీశైలం మాట్లాడుతూ విద్యార్థులు పదో తరగతిలో మంచి మార్కులు సాధించాలని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

మండల టాపర్‌కు రూ.25వేల ప్రోత్సాహకం

పెద్దేముల్: పరీక్షలు ఉన్నాయని విద్యార్థులు ఆందోళన చెందవద్దని కాంగ్రెస్ పార్టీ బ్లాక్ ఏ అధ్యక్షుడు లొంక నర్సిములు అన్నారు. మండలంలోని తట్టెపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో 24 మంది పదో తరగతి విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు, జామెట్రీ బాక్స్‌లు అందజేశారు. పెద్దేముల్ మండలంలో మండల టాపర్‌గా నిలిచినవారికి రూ.25వేలు ప్రోత్సాహక బహుమతిగా ఇస్తానని ప్రకటించారు. ద్వితీయస్థానంలో నిలిచిన వారికి రూ.11వేలు ఇస్తానని తెలిపారు. మండలాధ్యక్షుడు గోపాల్, సొసైటీ వైస్‌చైర్మన్ ఆంజనేయులు, టీచర్లు పాల్గొన్నారు.

పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలి

కొడంగల్ : కొడంగల్ పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో బుధవారం 9వ తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. హాస్టల్ వార్డెన్ రాధిక మాట్లాడుతూ విద్యార్థులు రాబోయే వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని తెలిపారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులున్నారు.

సంక్షిప్తంగా..

● **శామీర్‌పేట** : నిరుపేదలకు రక్తదానం చేసి ఆదుకోవడమే నల్సార్ ధ్యేయమని వైస్ చాన్సలర్ శ్రీకృష్ణదేవరావు అన్నారు. శామీర్‌పేటలోని నల్సార్ క్యాంపస్‌లో గల నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైస్‌చాన్సలర్ ఆధ్వర్యంలో పీవీ నర్సింహరావు మెమోరియల్ ట్రస్టు వారు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 80మంది విద్యార్థులు, అధ్యాపకులు రక్తదానం చేశారు.

● **కులకచర్ల** : ఆర్ఎస్ఎస్, బీజేపీ ఆధ్వర్యంలో అయోధ్య రాముడి ప్రసాదం బుధవారం కులకచర్లలో ఇంటింటికీ పంపిణీ చేశారు. అదే విధంగా త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని వారు ప్రజలను అభ్యర్థించారు. మాజీ సర్పంచ్ సౌమ్యారెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు మహిపాల్, కరుణ, కె.మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

● **మోమిన్‌పేట్** : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పక వేయించాలని మండల పశువైద్యాధికారిణి గీత సూచించారు. ఈమేరకు మండలంలోని ఎన్కతల గ్రామంలో పశువులకు బుధవారం పశువైద్య సిబ్బంది గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. 298 పశువులకు ముందస్తు జాగ్రత్త చర్యగా టీకాలు వేశారు.

వివాహ వేడుకలో ఎమ్మెల్యేలు



మాజీ ఎంపీపీ పద్మ జగన్‌రెడ్డి 2వ కుమారుడు వంశీ వివాహం బుధవారం అంతాయపల్లిలోని పుష్ప కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. - మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 13